# ఒరేయ్ వెంకటచలం

నేను రైలుపెట్టె యెక్కి యెక్కడంతో ఓమూలనించి,

'ఒరేయ్ !' అని కేక వినపడ్డది.

నన్ను ఒరేయ్ అని పిలిచేవాళ్ళిద్దరే వున్నారు లోకంలో. వాళ్ళు నాకు ప్రేమాస్పదులైనందువల్ల సంతోషంతో తలెత్తి చూశాను. నాకేసి పరమానందంతో చూస్తున్నాడు తెలిసినవాడు దొరికాడు కదా అన్నట్టు. ఆయనెవరో నాకు తెలీదు, నన్నేనా అని అనుమానపడుతున్నాను.

'ఇట్లారా, చోటుంది యిక్కడ.' అంటున్నాడు పైగా.

ఇన్నేళ్ళూ నన్ను వొదిలిన బంధువు దొరకన్నా దూరదేశంలో చూచిన ప్రేమచేత పలకరిస్తున్నాడా యేం? అనుకుని వెళ్ళాను. ఒక ట్రంకుని బల్లమీదనించి తీసి, ఓ గుజరాతివాణ్ణి మనిషికి కావలసినంత స్థలమే ఆక్రమించుకునేట్టు తోసి నాకు చోటుచేశాడు.

'అట్లా చూస్తావేం? నన్నెరుగవూ?'

రైలెక్కగానే బంధువుకు దొరికిన నా అదృష్టానికి గావును, అందరూ నావంక చూస్తున్నారు. లోకంలోకెల్లా నాకు యిబ్బందైన విషయం రైలుపెట్టెలో అందరూ నావంక చూడడం.

ఈయన్ని 'నువ్వు' అనాల్లో 'మీరు' అనాలో తెలీదు. ఇంత పెద్ద రైల్లో యీపెట్టె నాకు ఎట్లా తటస్థపడ్డది?

'ఎరక్కేం?' అన్నా.

'ఐతే నే నెవరు?'

నామీద అంత నమ్మకం లేకపోతే, నన్ను పిలిచి పక్కన కూచోపెట్టుకోమన్న దెవరు? —

'ఏం చెయ్యను?

'మరిచిపోయినాను'

'నిజం చెప్పు'

అసలు యెరగనేవా!

'తెలీదు'

'ఈ డాబులకేం లే! నువ్వు నన్నెరక్కేం?'

'ఐతే జ్ఞాపకం రావటంలేదు'

పెట్టింతా అదిరేట్లు నవ్వాడు.

'నన్నెరగవులే నిన్ను నే నెరుగుదును'

ఎవరో చెప్పు అని ప్రశ్న వేస్తానేమోనని ఆశతో ఆగాడు. నేను కొత్తచెప్పు కాల్ని కరిచినచోట చూసుకుంటున్నాను.

'నువ్వెవరో చెప్పనా?'

చూస్తున్నాను. మతి సరిగావుందా యీయనకి? అని. వొద్దని యెట్లా అనను?

'నువ్వు వెంకటచలం'

'కాదండీ, నేను సూర్యనారాయణని?'

'డాబులు కొయ్యకు. నువ్వు వెంకటచలం.'

'ఏ వెంకటచలం.'

'ఇంకెవడు? కథలువ్రాసే వెంకటచలం.'

'కాదండి ఆయన్ని నేనెరుగుదును'

'ఈ మాటలకేంలే? నిన్ను నువ్వెరగవా?'

నన్ను ఎగాదిగా చూశాడు.

'ఒరే, ఏమిట్రా ఆకథలూ నువ్వూనూ'

'నాకు తెలీదండి ఆ కథల సంగతి.'

'ఆ సంగతి సరేలే.........జరిగాయే అనుకో జరిగినంత మాత్రాన వ్రాయాలా? తప్పు కాదూ? భోజనంచేశామనుకో, తరవాత సంగతికూడా వ్రాసుకుంటారా?'

'నన్నడుగుతారేమిటి?'

'ఆ సంగతి సరేలే. వ్రాశావనుకో, ఏమంటావు?

'అట్టు సరేలే, వ్రాయవొద్దనలేదు. జరిగినవి వ్రాయడం ఎందుకు'

చూస్తున్నాను అర్థంగాక!

'పాపం, వాళ్లమనసులు నొచ్చుకుంటాయాలేదా?' అన్నాడు,

నిట్టూర్పు విడిచి.

'ఎవరి మనసులు?'

'ఆ ఆడపిల్లలవి?'

'ఏ ఆడపిల్లలవి?'

'విసుక్కున్నాడు.

కొడతాడనుకున్నాను.

తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం సంఖ్య

'అదేరా. ఏదో నిన్ను నమ్మి వొచ్చారనుకో. వొస్తే? బట్టబయలు చెయ్యాలా?'

'ఆడపిల్లలెవరు? నన్ను యిష్టపడి రావడమేమిటి?'

అంత అదృష్టమా అనుకున్నాను, స్వగతంలో

'తెలుసులేరా? ఇంక అల్లాంటిపనులు మానుకో' అని.

ఆలోచనగా. 'నీలో యేంచూసి వొచ్చారో?' అనుకున్నాడు నన్ను బాగా పరికిస్తో.

'ఎవరూరాలేదు. రారు.'

'మరి వొప్పుకుంటూ వనుకున్నావా! నాకు తెలుసులేరా?'

'బాగానే వ్రాశావుగాని, నువ్వు వ్రాసినవి ఒకలెఖ్ఖా జమా! ఈనాడు అసలు రొమాన్సు అనేదివుందా! ఒరే, యిప్పుడున్నదల్లా రొమాన్సు కావాలనే ఆశవల్ల పుట్టిన జాడ్యం. అంతేకాని చూడు. ఈ కొత్త ఆడపిల్లలు—ఎవరి వెంటపడుతున్నా రంటావు?— ఈకొత్త కాలేజి కుర్రాళ్ళ వెంట. కవిత్వాలూ, కథలూ వ్రాసే కుర్రకుంకల వెంట. వొరే! కథ చివరిదాకా వ్రాసేందుకు కలంపట్టుకునే బలంలేదే, వీళ్ళకి! కథలు వ్రాసినవాడు కథలోమల్లే చెయ్యగలడనే యీ వెర్రిగుంటల వుద్దేశ్యం? పొడుగుజుట్లూ, ఫ్రెంచి మీసాలూ, సోన్నెలూ, వొల్లెవాట్లూ, యివీ ఈనాటి పురుషలక్షణాలు. చొక్కాకింద వెమికలకుప్పలు, ఏదీ నీచెయ్యి? చూడు, ఏమూలన్నా, ఒక్క రవ్వ కండ.........'

కుయ్యి మని చెయ్యి లాక్కున్నాను.

'ఏం చేస్తున్నావురా, యిన్నాళ్లూ, యిన్నేళ్లూ? ఏమిటా పుస్తకం... షా.........అంటే షా లూ, లారెన్సులూ చదువుతున్నావు. నీ బతుకంతా,

మరి యీ పుస్తకాలతోనే వూరేగు. ఆడపిల్లలెందుకురా నీకు ? ఏం చేసుకుంటావురా ? వాళ్ళనీ విప్పి చదువుకుంటావా ? ఏంచేస్తారు రాత్రంతా 'షా' చదువుకుని, స్త్రీలకి స్వతంత్రంలేదని తర్కిస్తారా ? ఈ సంఘాన్ని సంస్కారం ఎట్లా చెయ్యాలా, యే కాన్ఫరెన్సులు పెట్టాలా, ఏం లెక్చర్లియ్యాలా అని యోచిస్తారు తెల్లార్లూ—ఒకే పక్కమీద కూచుని' ఓరి జోగుల్లారా? ఎందుకురా స్వతంత్రం మీకు. ఓ మొగుడూ, ఓ పెళ్లాం చాలరా మీబతుకులకి ?'

ఆగాడు. చుట్టూ చూశాడు. ఎక్కడికన్నా పోదామని నేవను వొస్తుందేమోనని కిటికీలోంచి నేను చూస్తున్నాను. పోతే తంతానంటే...

'నీ యీడున్నప్పుడు ఇట్లా చూడు, నా జబ్బపట్టి చూడరా'

నాకు మొగవాళ్ళని తాకడం బావుండదు.

ఏంచెయ్యను ?

'ఇంకావొస్తు — అంతేనా ?'

బిగ్గరగా నవ్వాడు.

'చూశావా ? నీ యీడున్నప్పుడూ, పరుగెత్తే దున్నపోతు తోకపట్టుకు వెనక్కి లాగితే, దున్నపోతు ఆగేదిరా. మరి నువ్వు ఎన్నడన్నా దణ్ణాలు తీశావా ? చెడుగుడు ఆడావా? మరి ఏంచేస్తున్నావు ? ఓ మైలు పరుగెత్తుతావా ? పరీక్షలు పాసవుతున్నావు. Love letters వ్రాస్తున్నావు. రోడ్డుమీద ఆడపిల్ల కనపడితే వెంటపడతావు—మరి ఎవరన్నా తన్నవొస్తే పరుగెత్తకలవూ? రాత్రిపూట మూడడుగులగోడ దాటగలవురా? ఇంకేం రోమాన్సురా ? నీకు నీ మోహం.'

అది మహారాష్ట్రదేశం గనక తెలుగు తెలీదుగనక సరిపోయింది. తెలుగు రైలుపెట్టెలో అట్లా అరిచి ఆమాటలంటోవుంటే నన్ను !......

'టెన్నిసన్ కవిత్వం, హానిబాల్ శౌర్యమూ, కృష్ణదేవరాయడి బలమూ, కాళిదాసు రఘువంశమూ, మీకాలేజీ పార్లమెంట్లూ స్వరాజ్యం— జపాన్‌వాడితో నువ్వేగా పోట్లాడేది ?'

ఆగి చుట్టూచూశాడు. వాళ్లెవళ్ళన్నా పోట్లాడగలరేమో, అన్నట్టు.

'ఇంత చాతకాని వాళ్ళు గనకనే కొత్త థియరీలు పెట్టారు —

మాస్తోనే వున్నానురా, మీ వ్రాతలూ—ఆధ్యాత్మిక ప్రేమలూ, ప్లేటోనిక్ లవ్‌లూ, మానసిక సానుభూతి, పవిత్రత్వా, కళా వుపాసనా — మీ వ్రాతలట్లా వున్నాయి గనకనే మీ రాత లిట్లా యేడిశాయి—'

'వెంకటచలంగారు వాటిని వొప్పుకోరండి'

'నువ్వు వొప్పుకోవులే. కాని నువ్వుమాత్రం—విన్నావూ, ఆ షికార్లూ నవ్వులూ, టీపార్టీ, బోట్లమీదా రైళ్ళమీదా గంతడాలూ........ఆడపిల్లల్ని రోడ్లపాల తిప్పడమెందుకురా! అలిసిపోవాలనా? అవునులే, అంతకన్న చాతకానప్పుడు ఏం చేస్తావులే?

ఒరే నామాట విని ఆ కథలు మానెయ్యి. ఎందుకురా నీ అనుభవాలూ నువ్వూను. నన్నెరుగుదువుగా!'

'అవన్నీ వూహించి వ్రాసినవండి. ఆయన అనుభావాలు కావు ఆయన్నెరుగుదును నేను'

'సరేలే ఎవరిమిందన్నా బొంకుగాని, నా ముందు కాదు' నాకు తెలేనిదేమీలేదు. మహామహావాళ్లని చూశాను. ఏం తెలుసురా నీకు ప్రేమంటే? నీకేం తెలుసు? నన్నడుగు చెపుతాను. ఎప్పుడన్నా మావూరురా, నేను దాచిన వుత్తరాలు చూపుతాను. ఫొటోలూ వున్నాయిరా? నేనే నా కథలు వ్రాస్తేనా? ఇట్లాంటి ఆడవాళ్లా? ఇంతంత కళ్ళూ, ఇంత జుట్టు, ఇంతంత........'

వెళ్ళిపోతోంది ప్రవాహం. నుంచున్నాడు. ఆ జుట్టునీ కళ్ళనీ చేత్తో చూపుతో వర్ణిస్తున్నాడు. పెట్టెలోవాళ్ళు తెలుగువాళ్ళు హిందీ ఫిల్ముని చూసినట్టుచూసి ఆనందిస్తున్నారు. ఒకళ్ళిద్దరు లేచి ఆడదానికి సిద్ధమయ్యేట్టున్నారు. 'పాటు పాట' అంటారు కొంతసేపు పోతే. ఇదేం ఖర్మం నాకు?

'మరెవరో చెప్పారురాను?'

'నేనా!' కూచున్నాడు. 'నన్నెరుగవూ?'

'ఎరగను'

'ఎరక్కేం. నేను యవ్వనంలోవుండగా ప్రతి పత్రికలోనూ నా

ఫొటో వెయ్యాలని యీ పత్రికలవాళ్లని ఆశ్రయించే వాణ్ణా నీకుమల్లే! వాళ్లే నా గుమ్మంముందు పడివుండేవాళ్ళు, ఏమనుకున్నావో? విన్నావుగా? వజ్రేశ్వరశర్మ నా పేరు?

'మీరా అండీ! చిన్న కుర్రాణ్ణి నేను, మీరు మా కాలేజీలో డిమాన్‌స్ట్రేషన్ యిచ్చినప్పుడు........'

నాకు జ్ఞాపకమొచ్చింది, ఆ పటం.

చెయ్యి కదిలినవా, కాలు కదిల్చినా తాచుపాముల్లాగ పెనవేసుకునే నిగనిగలాడే కండలు చల్లని చర్మంక్రింద వుబ్బి కళ్ళను చెదరగొట్టే బలం......

అంత 'రాట్' ఆయన మాట్లాడినా, నాకు అద్భుతమైన అభిమానం కలిగింది. శరీరబలానికి ప్రజలుయిచ్చే అప్రయత్నమైన గౌరవం.

'ఎరుగుదువుకద! మాకాలంలో నా యీషికార్లూ యీ కవిత్వాలూ ఏమీలేవు. ఒక్క చూపు, ఒక్కమాట— చాలు—ఈ టేలకు పిలవడాలూ, యీ పేర్లులేని చీట్లూ, యీ పుస్తకాల్లో పర్యాలకీ పెనసలుగీట్లూ, యీ గూఢకవిత్వాలూ, భావగీతాలూ, భావోద్రేక కథలూ, ప్రేయసులూ, హంసలూ, కోకులూ, కోయిలలూ,—ఏమీ లేవు. అసలు మా పనేమిటో అది జాగ్రత్తపడేవాళ్ళం. కోయిలలూ మంధమారుతాలూ వాటి జాగ్రత్త అవి పడేవి. వెతకడాలూ, చుంబనాలూ, మా చాతకావు.

'ఎందుకురా వెధవ చదువులు! పదిగారెలు తినలేని, ఇద్దరు ఆడవాళ్లకి జవాబు చెప్పలేని చదువులు రెండుకురా అవి? ఆ జాగ్రఫీల బదులు దేశమంతా తిప్పకూడదూ? ఆ హిస్టరీ బదులు పాత చాణక్యాలకోసం గోతులు తవ్విస్తే, వృక్షశాస్త్రం బదులు దున్నిస్తే, జంతుశాస్త్రం బదులు గాడిద తొక్కిస్తే, గంటకి రెన్ని దండాలు తియ్యగలరో ఆ లెక్కలు చెపితే బాగుపడతారు మీరు. బైరన్ చదివి, ఎంకిపాటలు పాడి 'షా' ని కోట్ చేసి, కథలురాసి, ఆడపిల్లల్ని మరిగించి, తీరా భార్యని వొస్తే నువ్వులేసే దేమిట్రా! ఒకటిన్నర తులం కాడు బిస్కటు ముక్కా, అరకప్పు టీ యిస్తావా వొయ్యారంగా? తీరా సమయం వొచ్చేప్పటికి మేమ్మేమ్మే అనడం— లేకపోతే ప్రేమమీద లెక్చరు కొట్టడం, తప్పించుకు పారిపోవడం.

అయితే యింకోటిలే ఈ నాటి ఆడపిల్లలూ అట్లానే వున్నారు. చప్పిదవడలూ, కాలికీ కంటికీ జోడూ, వొంగిన నడుములూ, పాచలటి చేతులూ— ఎందుకురా వాళ్ళు.........అన్నీ వున్న పిల్ల ఒక్కత్తె కనపడదే, వొద్ది వాళ్లల్లో తప్ప! నరిపోయినారులే ఒకరికొకరు!'

'ఇదేనా పోలాపూరు?'

రైలు వేగం తగ్గించింది. ఆయనలేచి నలుగురిమీద నుంచి పెట్టా పక్కా సర్దుతున్నాడు. మాటలు మాత్రం ఆగలేదు.

'అయినా బొంబాయి యెందుకు నువ్వు? ఆంధ్రదేశంచాలలేదూ? విన్నానే! ఆ మైసూరుపాకు సంగతేం?

'ఏమిటది'

'తెలీనట్టు చూడకు. చేసి పైగా దొంగచూపులు పెడతావా? ఆ వెధవవేషమే మండుకొచ్చేది. మనలో మనకేం? వొప్పుకో కూడదూ అంతమాత్రం? ఆ కాఫీహోటలువాళ్ళేమన్నారు? చెప్పు నా, హ హ 'ఆంధ్రదేశం చాలదా, మైసూరుమీద పడ్డాడా?' అన్నారటగా! బలే వాడివి.'

'అదేదో వెంకటంచలంగారేమో నాకు తెలీదు.'

'ఒకే, అబద్దంచెపితే, 'జోక్' కాసేవు. పోద సమానం అదేమాటా? అందుకనే మండుకొస్తుంది యీ కుర్రాళ్ళతో మాట్లాడ్డం? పిరికివెధవలు— నువ్వేదో నయమనుకున్నా, కథల్లో నీ డాబులుచూసి. అందరికన్నా— అన్యాయం నువ్వు. సరేలే, బొంబాయిలో జాగర్త. తన్నులుతింటేవు! మొగాళ్ళు కాదు ఆడవాళ్లే ంతారు. ఆంధ్రులకు అపరిదిష్ట తేకు.'

రైలాగింది. సామాన్లు దించుకుంటున్నాడు. చప్పున యేదో జ్ఞాపకం వొచ్చి తలుపు దగ్గిర్నుంచే 'ఒరేయ్' అన్నాడు.

ఆ అరుపుకి ముగ్గురుపోర్టర్లూ, ఒక గుమాస్తా, రెండు కుంటి కుక్కలూ ఆగాయి ఆ పెట్టె దగ్గిర.

'అయినా ఆ యూరేషియను పిల్లతో నీకేం పనిరా? కంపుటుగా వాళ్లదగ్గిర?'

'నాకేం తెలుసు?'

•   •

'ఇంత పిరికి వెధవ్ని అనుకోలేదు. ఎంత మోసపోయినాను!'

'నే నా వెంకటచలం కాదండీ.'

'కాదూ? ఎవరు నమ్ముతారు?'

మీరు నమ్ముతారా అన్నట్టు బండిలోవాళ్ళనీ స్టేషనులో వాళ్ళ వంకా చూశాడు.

బండి సాగింది.

నేను నిట్టూర్పు విడిచి ఆలోచిస్తున్నాను.